క్లుప్తంగా

యూపీఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా



భీమవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: కేంద్ర క్యాబినెట్ ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా శుక్రవారం భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆర్.రాంబాబుకు అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కెఎస్‌సీహెచ్ సాయిరామ్, సీహెచ్ కుమారబాబ్జి, డి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ దశ నుంచే ఆలోచనలు మారాలి



డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న పాండురంగారావు

భీమవరం: విద్యార్థుల చదువులు కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా స్కూల్ దశ నుంచే పిల్లలు వ్యవస్థాపకులుగా ఎదిగేలా ఆలోచనలు చేయాలని భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఎం.పాండురంగారావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ఆవిష్కరణలు–వ్యవస్థాపకత అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన వ్యవస్థాపకత మెలకువలు, ఆలోచనా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ కన్వీనర్ ఎస్.రవిచంద్ మాట్లాడుతూ సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలను ఎలా స్థాపించాలి? దీనికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం వంటివి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఐబీసీ బృందం, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

భీమవరం: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీలు ముగిసినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలలో వివిధ క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. యోగ, టేబుల్ టెన్నిస్, ఫుడ్ బాల్, వాలీబాల్, క్యారెమ్స్, చెస్, బ్యాడ్మింటన్, వాక్‌రేస్, రోప్ జంపింగ్, బాస్కెట్ బాల్, రన్నింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా పోటీల్లో విజేతలకు ప్రశంస పత్రాలు అందజేస్తామని రాజేష్ తెలిపారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు రోడ్డులో కోళ్లపర్రు వద్ద ఈ నెల 25వ తేదీన మోటారు సైకిల్‌పై వెళ్లుతున్న ఇద్దరు వ్యక్తులను ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను 108లో భీమవరం ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందారు. అనంతరం బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు చెప్పారు. గురవయ్య పాలెం నుంచి మోటారు సైకిల్‌పై దానకొండ నాగరాజు, అతని భార్య స్వగ్రామమైన కాకినాడ సమీపంలోని సాగర్ పేటకు బయలుదేరి వెళ్లుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టినట్లు ఫిర్యాదు చేశారన్నారు.

బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు

మండలంలోని గుమ్ములూరు రోడ్డులో ఈ నెల 26న గుమ్ములూరు గ్రామానికి చెందిన చొప్పల చిన్న యోహాన్, అతని స్నేహితుడు మోటారు సైకిల్‌పై కోళ్లపర్రు గ్రామం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బొలేరో వాహనం ఢీకొట్టిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు శుక్రవారం తెలిపారు. సంఘటనలో ఇద్దరికీ గాయాలవ్వగా ఆకివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ప్రకటనపై ఆర్యవైశ్యుల హర్షం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని ప్రభుత్వం కార్యక్రమంగా నిర్వహిస్తామని ప్రకటించడంపై ఆర్య వైశ్య వర్తక సంఘం, ఆర్య వైశ్య యువజన సంఘం, ఆర్య వైశ్య మండల సంఘం సభ్యులు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా భీమవరం ఆర్యవైశ్య సంఘ భవనంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, జూలూరి వెంకటేష్, కంచర్ల వెంకట రమణరావు, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

భీమవరం (ప్రకాశంచౌక్): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఉదయం భీమవరం డిపో గ్యారేజీ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వైవీ రావు మాట్లాడుతూ 114 జీఓ ప్రకారం నైట్ అవుట్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడి సాయం అందేనా?

- ఖరీఫ్ సాగులో రైతన్నకు దక్కని భరోసా
- హడావుడిగా పేరు మార్చినా సాయంపై నోరుమెదపని ప్రభుత్వం

ఆకివీడు: అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. ఐదేళ్ల పాటు రైతన్నలకు వెన్ను దన్నుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉండి పంట ప్రారంభ సమయంలోనే రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం ద్వారా ఆదుకుంది. పంట సాగుకు ముందే రుణ సదుపాయం, రైతు భరోసా అందజేసింది. ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 90 రోజులు గడుస్తున్నప్పటికీ రైతులకు ఎలాంటి మేలు జరగలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షాలు కురవడంతో రెండుసార్లు నారు మడులు పోసుకోవాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. అయితే అనుకోని ఖర్చు ఎదురైనా సాయంపై ప్రభుత్వం ఉదాసీనంగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సాయంతో పాటు సహకార రుణాలు కూడా రైతులకు అందడం లేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం రైతులు వడ్డీ వ్యాపారస్తులను, ఎరువుల దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

రూ.20 వేల సహాయం మాటేమిటి?

గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.7500, కేంద్రం సహాయం రూ.6 వేలుతో కలిపి మొత్తం రూ. 13,500లు రైతులకు పెట్టుబడిగా అందజేసేవారు. ఎన్నికల్లో కూటమి పార్టీ వాగ్దానం మేరకు రైతులకు రూ. 20 వేలు పెట్టుబడి సహాయం అందాల్సి ఉండగా నేటికీ ఒక్క రూపాయి రైతుల ఖాతాల్లో జమకాలేదు. రూ.20 వేలు సహాయం అందుతుందా? అని రైతులు కూటమి నాయకులను నిలదీస్తున్నారు.

ఉచిత బీమాకు మంగళం

రైతులకు గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం కల్పించింది. కూటమి ప్రభుత్వం ఉచిత బీమా మాటే ఎత్తడం లేదని రైతులు వాపోతున్నారు. తుఫాన్, వాయుగుండం ప్రభావంతో రైతులు వణికిపోతున్నారు. ఆకుమడులు నష్టపోయినా ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు.



ఖరీఫ్ సాగు చేస్తున్న దృశ్యం

రైతుల వివరాలు ఇలా

మండలం		రైతులు
ఆకివీడు	:	2565
ఉండి	:	3726
కాళ్ళ	:	2386
పాలకోడేరు	:	4091
మొత్తం	:	12,768

రైతులకు సహాయం ఏదీ?



రైతు పెట్టుబడులకు సహాయం అందకపోవడంతో అప్పులోళ్ల దగ్గరకు పరుగెట్టాల్సి వస్తుంది. ధాన్యం డబ్బు ఆలస్యంగా చెల్లించారు. అప్పటికే వడ్డీలకు తెచ్చి ఖరీఫ్ సాగు చేశాం. భారీవర్షాలు, వరదలకు ఆకుమడులు, నాట్లు నీటి పాలయ్యాయి. మళ్లీ పెట్టుబడులు పెట్టాము. అప్పుమీద అప్పు చేయాల్సి వచ్చింది. సాగు సమయానికి పెట్టుబడి సహాయం అందకపోతే రైతుకు దిక్కేది. బీమా ప్రీమియం చెల్లింపులు కూడా చేయడం లేదు.

– తోట శివాజీ, రైతు, సిద్ధాపురం, ఆకివీడు

ముగిసిన నాక్ బృందం పర్యటన

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ పీర్ కమిటీ పరిశీలన శుక్రవారం ముగిసింది. రెండో రోజు పరిశీలనలో కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, రికార్డులు, విద్యార్థుల తరగతి గదులు పరిశీలించారు. పీర్ కమిటీ పరిశీలన ముగిసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ షిరీష్ కుల్‌కర్ని మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక విద్య అందుబాటులో ఉండే విధంగా అప్‌డేట్ అమలుజేయాలన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఆధునిక కంప్యూటర్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కళాశాలలో పచ్చదనం, పరిశుభ్రత, విశాలమైన క్రీడా ప్రాంగణం, విద్యార్థులకు అవసరమైన లైబ్రరీలు ఉండడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రగతిపై నివేదికను పీర్ టీమ్‌కు ప్రిన్సిపాల్ కె.సుజాత అందజేశారు. కార్యక్రమంలో పీర్ కమిటీ సభ్యులు ఎస్ఎంకే. క్వాద్రీ, కోఆర్డినేటర్ సీహెచ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో మాట్లాడుతున్న నాక్ పీర్ బృందం చైర్మన్ షిరీష్ కుల్‌కర్ని

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకోడేరు: పేద కుటుంబానికి చెంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబానికి ఆర్య వైశ్య జిల్లా సంఘం ఆర్థిక సాయం అందజేసింది. విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండ సోమేశ్వర రావు భార్య, మానసిక వికలాంగుడైన కుమారుడు నాని తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇంటికే పరిమితమై ఉండడంతో స్నేహితుల ద్వారా ఆకివీడుకు చెందిన మండల ఆర్యవైశ్య సంఘం సన్నిధి రామ వెంకటేశ్వరరావు, గొంట్ల గణపతి, గుర్రం శ్రీనివాస రావు తదితర సంఘ సభ్యులు తెలుసుకుని రూ.1.05 లక్షలు సేకరించారు. ఈ సొమ్మును శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిర్లంచర్ల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కందగట్ల రఘురాములు ఉపాధ్యక్షుడు కోడూరి కుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి మానవత్వంతో ఆర్థిక సహాయం చేసిన ఆకివీడు మండల ఆర్య సంఘ సభ్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో చిర్లంచర్ల శ్రీనివాసరావు, సన్నిధి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

భీమవరం: పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రవాణా శాఖాధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భీమవరం పట్టణ కార్యదర్శి బి గణేష్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫిట్‌నెస్ లేని బస్సులో అధిక సంఖ్యలో విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణాశాఖ తక్షణమే విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో రవాణాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యాంటీబయోటిక్స్ వినియోగంతో అనర్థాలు

భీమవరం: మానవాళి యాంటీబయోటిక్స్‌ను విచ్చలవిడిగా ఉపయోగించడంవల్ల బ్యాక్టీరియా నిరోధక శక్తి సంపాదించి పెనుముప్పు కలిగించే ప్రమాదముందని సీటీఎస్ఐ సౌత్ ఆసియా మెడికల్ ఆపరేషన్స్ అండ్ క్వాలిటీ డైరెక్టర్ డాక్టర్ రజా అలీఖాన్ అన్నారు. భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఔషధాలు, విశేషమైన బయో అవైలబిలిటీ, హాఫ్‌లైఫ్, ఇంట్రాక్షన్ వంటి సమాచారంపై ఫార్మసీ విద్యార్థులు అవగాహనతో ఉండాలని చెప్పారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న మందులు 20 ఏళ్ల పూర్వం కనుగొన్నారని, మార్కెట్‌లోనికి వస్తున్న నూతన ఔషధాల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని రజాఅలీఖాన్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, డాక్టర్ రాజ్‌కిషోర్, కళాశాల ప్రిన్సిపల్ కేఏస్ నటరాజ్, క్యాంపస్ డైరెక్టర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.



విష్ణు కళాశాలలో మాట్లాడుతున్న రజాఅలీఖాన్

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ వారి సన్నిధిలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం భీమవరానికి చెందిన అయితం శ్రీనివాస్ నాగలక్ష్మీ దంపతులు వారి కుమార్తె ప్రణతి పేరట రూ.1,00,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి శేషవస్త్రం అమ్మవారి ఫొటో అందజేశారు.

అమ్మవారికి గజమాల సమర్పణ

మావుళ్లమ్మ వారికి శుక్రవారం సందర్భంగా పట్టణానికి చెందిన భక్తుడు దుర్గాప్రసాద్ గజమాల సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ(చిన్ని) అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న శ్రీనివాస్,నాగలక్ష్మీ దంపతులు

చట్టాలపై అవగాహనతో ఉండాలి

కాళ్ల: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎస్.శ్రీనివాసరావు సూచించారు. కాళ్ళ మండలం కోలనపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలని, సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇ.నాగార్జున, సర్పంచ్ కె.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉండి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉండి ఎస్సై నసీరుల్లా అన్నారు. శుక్రవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో గంజాయి, సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ వంటి పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు కావడం వల్ల జీవితాలు నాశనం అవుతున్నాయని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ కాలేజ్ ప్రిన్సిపల్ వీ శ్రీనివాసరాజు, ట్రైనింగ్ అధికారి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటన సిగ్గుచేటు

ఆకివీడు: సభ్యసమాజం మరోసారి తలదించుకునే విధంగా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన సంఘటన ఉందని మహిళా సమాఖ్య, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటన మహిళలపై రాష్ట్రంలో జరుగుతున్న దారుణాల్లో మచ్చుతునక అన్నారు. ఇటువంటి ఘోర సంఘటనలు జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గుడ్లవల్లేరు ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



జ్యోతిరెడ్డి

మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకం కాకూడదు!

మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకం కాకూడదని, చట్టాలు ఎన్ని వచ్చినా కఠిన శిక్షలే శరణ్యమని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు సందక ఉదయ్ కుమారి, మండల అధ్యక్షురాలు డోకల లక్ష్మి అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అరాచకాలపై ప్రభుత్వాలు, కళాశాల యజమాన్యాలు వెంటనే స్పందించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. సభ్యమరచి దుర్మార్గంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలతో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



మోగల్లులో మొక్కను నాటుతున్న సర్పంచ్ మల్లి పూడి కృష్ణకుమారి



ఎన్నార్పీ అగ్రహారంలో మొక్కలు నాటుతున్న నాయకులు

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీఓ నూకల మురళి గంగాధర రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు మొక్కలను పెంచడం వల్ల సమతుల్యత అభివృద్ధి చెంది స్వచ్ఛమైన గాలి, అదేవిధంగా సకాలంలో వర్షాలు పడి మానవాళి మనుగడకు అనుకూలిస్తాయని అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయ బాబు మాట్లాడుతూ మండలంలో 2300 మొక్కలు వచ్చాయని వీటిని రోడ్డుకు విరువైపులా కాలువల వెంబడి నాటుతున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బొల్లా శ్రీనివాస్, శివ రామరాజు,చిల్లా అనూష, కడలి నాగేశ్వరి, జంగం సూరిబాబు, మల్లిపూడి కృష్ణకుమారి, ఇంజేటి టి.మరియమ్మ పాల్గొన్నారు.

ఎంపీడీవో మురళీ గంగాధర్ రావు

భీమవరంలో...

భీమవరం(ప్రకాశం చౌక్): వనం మనం కార్యక్రమం భాగంగా శుక్రవారం స్థానిక సోమేశ్వర స్వామి గుడి సమీపన దక్షిణ వైపు ఉన్న రోడ్ మార్జిన్‌లో ఎమ్మెల్యే అంజిబాబు అధికారులతో కలిసి మొక్కలు నాట్టారు. మొక్కలు పెంచడం ద్వారా కలుష్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: మొక్కల్ని పెంచి మనల్ని మనం కాపాడుకుందామని ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గవెంకటార్యులు, ఎంపీటీసీ సభ్యురాలు మున్నలూరి సువర్ణలక్ష్మీ అన్నారు.శుక్రవారం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు మొక్క నాటడం అంటే భవిష్యత్ తరాలకు పునాది వేయడమేనని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ముగ్గళ్ళ సత్యానారాయణ, బాలకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి జేవీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



శ్రీఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు



చిన్న మావుళ్లమ్మ ఆలయం వద్ద వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో శుక్రవారం పలు అమ్మవారల్ల ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. గునుపూడి శ్రీ ఆదిలక్ష్మీ రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో సుమారు 650 మంది మహిళలచే ఆలయ అర్చకులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తుల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు పాల్గొన్నారు. భీమవరం మెంటే వారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి ఆలయంలో 108 మంది మహిళలలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అల్లూరి కృష్ణ మోహనరాజు విజయలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కంతేటి వెంకట్రాజు, కుక్కల బాల, సూరిబాబు,మధు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. టూటౌన్‌లోని రామరాజు తోటలో ఉన్న శ్రీ చిన మావుళ్లమ్మ అమ్మవారి సన్నిధిలో 200 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నిర్వహించారు. మావుళ్లమ్మ సేవాసమితి అధ్యక్ష ,కార్యదర్శులు రామాయణం వెంకట లక్ష్మీతులసి పార్వతి, రేవూరి గోగురాజు పాల్గొన్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు, యనమదుర్రు, వెంప, చినఅమిరం, తాడేరు, బేతపూడి, దెయ్యాలతిప్ప, కొత్తపూసలమర్రు, లోసరి తదితర గ్రామాలలో గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ, పర్లమ్మ, వీర్లవెంకమ్మ, మారెమ్మ, గరవళ్లమ్మ అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం నుంచే మహిళా భక్తులు పూజా సామగ్రితో ఆలయాలకు చేరుకుని ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో వ్రతాలు చేశారు.

నేడు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

భీమవరం: ఎయిడ్స్, హెచ్ఐవీ నివారణపై జిల్లా వ్యాప్తంగా మీకు తెలుసా కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.భానూనాయక్ చెప్పారు. భీమవరం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి నుంచి మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వివాదాస్పద ఆలయంలో రాత్రికి రాత్రే అమ్మవారి విగ్రహం

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయ గోపుర నిర్మాణం వివాదాస్పదంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే గురువారం అర్ధరాత్రి నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి ఉత్సవ విగ్రహం దర్శనమివ్వడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. ఆలయ చుట్టు పక్కల ఉన్న స్థానికులు మాత్రం ఆలయ కమిటీ సభ్యులే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించారని ఆరోపిస్తున్నారు.